# కొత్త సూర్యుడు

ఇంకా తెల్లవారలేదు.

మంచు దట్టంగా పట్టివుంది. చలి గడగడలాడిస్తోంది. చలికి భయపడి కాలోలు ఎవరూ ఇళ్ళతలుపులు తెరవలేదు. కానీ గంట ఆరు కావస్తోంది. హైదరాబాదులో సిటీకి దూరంగా కట్టిన కాలనీలో కొత్త ఇళ్ళు దూరదూరంగా వుండటాన చలి మరీ ఎక్కువగా అన్పిస్తోంది.

సుందరరామయ్యగారు సూపర్నెంటుగా ఉద్యోగం చేస్తున్నారు. ఆయన భార్య బాలా త్రిపురసుందరి. ఈ దంపతులకి నలభైఏళ్ళు దాటినా ఇంకా పిల్లలు లేరు. ఈ కాలనీలో కొత్తగా ఇల్లు కట్టుకున్నారు. నాలుగు గదుల ఆ ఇంట్లో రెండు గదులు అద్దెకి ఇచ్చారు. అద్దెకి వచ్చినవాళ్ళు కొత్తదంపతులు. ఆ ఇద్దరూ ఎంచక్కా చిలకా గోరింకల్లా వుంటారు ఇద్దరూ ఉద్యోగాలు చేసుకుంటూ వుండటాన వాళ్ళు ఇంట్లోవుండేది చాలా తక్కువ సమయం. ఆ కాస్సేపూ వాళ్ళ కబుర్లకి అంతువుండదు.

"దాంపత్యం అంటే అలా వుండాలి" సుందరరామయ్యగారు ముచ్చటపడిపోతుంటారు.

భీమేశ్వరరావుకి ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం. అతని భార్య అమరేశ్వరికి బ్యాంకు ఉద్యోగం.

ఎనిమిది కాకుండా అతడు వెడతాడు కంపెనీకి. తొమ్మిది అవవస్తూండగా టిఫెనుబాక్సు పట్టుకుని అమరేశ్వరి ముస్తాబై ఆఫీసుకి పరుగు తీస్తుంది. తిరిగి ఆ ఇద్దరూ ఎక్కడకలుసుకుంటారోగానీ సాయంకాలం ఒంటిగా ఇల్లు చేరతారు. అమరేశ్వరి చేతిలో పూవులూ, భీమేశ్వరరావు చేతిలో కూరలూ వుంటాయి. భీమేశ్వరరావు పొట్టిగా సన్నగా, నల్లగా వుంటాడు. అమరేశ్వరి తెల్లగా, లావుగా మిగలముగ్గిన జామపండులా వుంటుంది. అయినా చాలా హుషారుగా వుంటుంది. భీమేశ్వరరావు నిదానస్తుడు. అమరేశ్వరి హడావుడిపిల్ల. ఇద్దరి వయసూ పాతికేలా కన్పిస్తారు.

ఇంక సుందరరామయ్యగారి విషయానికి వస్తే ఆయన శాంతస్వభావుడే అని చెప్పాలి. ఆయన భార్య బాలాత్రిపురసుందరి సన్నగా, పొడుగ్గా గెడకర్రలా వుంటుంది. సుందరరామయ్య నలభైయ్యేపడిలో కూడా అందంగా ఆరోగ్యంగా శుభ్రమైన బట్టలు వేసుకుని నీట్‌గా వుంటాడు. బాలాత్రిపురసుందరి ఇందుకు పూర్తిగా విరుద్ధం. ఎప్పుడూ మడ్డిపట్టిన చీరెల్లో వికారంగా కన్పిస్తూవుంటుంది. అయినా ఆవిడకి నోరు పెద్దది. భర్తని, నలుచుకు తింటుంది.

ఉదయం అయిదింటికే లేస్తుంది. కాఫీ డికాషన్ వేసి కానీ ముఖం కడగదు ముఖం కడక్కముందే భర్తని లేపటం ప్రారంభిస్తుంది.

"ఏమండీ...ఏమండోయ్! ఇంకా ఏం నిద్రా. లేచి పాలు తెండి"

అయన కదలడు మెదలడు.

"పాలు తెచ్చినా ముఖాన తగలేస్తే కాఫీచుక్క గొంతులో పోసుకుని పని దానికి అంట్లు తగలేస్తాను. లేచారాలేదా''

"............"

"ఓ మొద్దుమనిషీ కుంభకర్ణులుంగారూ. ఓ పక్కన దోమలు కుట్టిచంపేస్తూంటే ఏమిటా మొద్దునిద్ర. దోమలంటే దోమలా ఈగలంతేసి వున్న అవి దోమతెరలోకూడా కుట్టితగలడ్డాయి. నన్ను కుట్టికుట్టిచంపాయి. ఎలా ఒళ్ళంతా దద్దుర్లు లేచాయో! మీకు మాత్రం ఏం బాధలేదు. అయినా ఈ వయసులోకూడా సుఖనిద్రపోవటానికి పెట్టిపుట్టాలి" బాలాత్రిపుర సుందరి మేలుకొలుపు ప్రతిరోజూ ఉన్నదే.

సుందరరామయ్యగారికి ఎప్పుడో మెలుకువ వచ్చేస్తుంది. భార్య మంచం అటూఇటూ కదిలేలా దొర్లి లేచి కూర్చుని అమడదూరం వరకూ విన్పించేలా ఆవులించటం విన్పించేసరికే మెలుకువ వచ్చేస్తుంది. అయితే చలిగా వుండటంవల్ల లేవబుద్ధికాక అలా పడుకుని భార్య సాధింపుని వింటూ వుండటం ఆయనకి సరదా. తను ఎంత మొద్దునిద్ర నటించినా బాలాత్రిపురసుందరి వదలదని ఆయనకి తెలుసు.

'ఏం...తనని లేపకపోతే తనే అలా వెళ్ళి ఆపాల కవర్లు తెచ్చుకుంటేపోలా' అన్న కోపం ఆయనకి. అసలు ఆపాలబూత్ దగ్గరకి వెడితే అక్కడకి వచ్చేది ఎక్కువగా ఆడవాళ్ళే. మరీ ఎదురింట్లో అద్దెకుండేవాళ్లు అందరూ పేరంటానికి కల్సి వెళ్ళినట్లు కబుర్లు చెప్పుకుంటూ వస్తారు. రాత్రి తొమ్మిదివరకూ పంచలో కూర్చుని కబుర్లు చెప్పుకున్నా తెల్లారేసరికి ఎలా వస్తాయో విషయాలు. గుడగుడలాడుతునే వుంటారు.

వాళ్ళతో తన భార్యకి స్నేహమే. వాళ్ళతో కల్సి పాలకి వెళ కూడదూ. వాళ్ళతో సినిమాలకీ, స్టీలు సామానుల చీటీలకీ, గుడులకీ స్వాములవార్ల దగ్గరికీ కల్సివెళ్ళే ఈ సుందరిమొద్దు ఈ పాలబూతు విషయంలో జత కలవదు. వాళ్ళ మొగుళ్ళు ఏ పూలతో పూజచేసుకున్నారో ఒక్కరోజైనా తనలా చలిలో లేచి ఈ పాలపాకెట్టు తెచ్చుకోవాల్సిన ఖర్మ లేదు. హాయిగా ఏడింటికి నిద్రలేచి ముఖం కడిగి క్లాసుగా కాఫీ తాగుతూ

వీధి వరండాలో పచార్లుచేస్తూ అచ్చమైన ఇంటి యజమానిలా పోజులు కొడుతూ పేపరు తిరగేస్తూంటారు. ఈ జన్మకి తనకా అదృష్టంలేదు. ఎందుకంటే ఈసుందరిని, అక్క కూతురైన ఈ మేనకోడలిని ఎప్పుడైతే పెళ్ళాడాడో అప్పుడే ఆ అదృష్టం చేజారిపోయిందన్న విషయం అప్పుడు తెలియలేదు. సుందరిని అయిదేళ్ళ పిల్లదగ్గరనుంచీ తను ఎత్తుకు ఆడించాడు. ఒకేఇంట్లో పెరిగి పెద్ద కావటంపల్ల చనువు అధికమైంది. ఆ చనువు పెళ్ళి అయినా 'భర్త' అన్న గౌరవము కన్పరచాలని తెలియనట్లుగా మాట్లాడుతుంది. ఈ విషయం గురించి చాలాసార్లు ఇద్దరిమధ్యనా ఘర్షణ జరిగింది. కానీ సుందరి రాజీధోరణికి రాలేదు. తన అలవాటుని మార్చుకోలేదు. చిన్నప్పుడు-అంటే పెళ్ళి కాకముందు మేనమామగా ఆమె తిరస్కారాన్నీ. తేలిక భావాన్నీ సహించగలిగాడు. కానీ పెళ్ళి అయిన తర్వాత చాలాసార్లు బాధపడవల్సి వచ్చింది తన చెంపలు తనే వాయించుకున్నాడు. మనసులో 'ఈ ప్రపంచంలో ఆడపిల్లలకే కరువు వచ్చినట్లుగా అక్కకూతుర్ని పెళ్ళాడటం ఏమిటి? పెళ్ళాడాను కనుక నాకిలాంటి శాస్తి కావాల్సిందే!'

చలిచలిగా వున్నప్పుడు వెచ్చగా రగ్గు కప్పుకున్నప్పుడు అదో లాంటి బద్ధకం. ఆ బద్దకంలో ఆ సుఖంలో జరిగిపోయిన విషయాలు గుర్తుకు వస్తూన్నప్పుడు, గమ్మత్తైన అనుభూతి కల్గుతూన్నప్పుడు అలారం అగనిగడియారంలా భార్య మేలుకొలుపు పాడుతూన్నప్పుడు ఒళ్ళు మండుకొస్తుంది. ఛస్తే లేవబుద్ధికాదు... కాదుకాకకాదు. బాలాత్రిపురసుందరి అయన్ని ఆ సుఖం అనుభవించనీయదు.

"మిమ్మల్నే...పిలుస్తుంటే వినపడటంలేదూ! చెవుల్లో చెట్లు మొలిచాయా! లేచిచావండి. కాళ్ళకి దణ్ణం పెడతాను."

బాలాత్రిపురసుందరి భర్తని తిడుతున్నా "మీరు' అన్న గౌరవ పదాన్ని వదలదు. అప్పుడప్పుడూ 'మామయ్యా' అనేస్తుంది.

సుందరరామయ్య ఈ పిలుపుకి అగ్నిలా మండుతాడు.

"ఆపు...ఆపేసెయ్! ఆ పిలుపు ఈ జన్మతో మరివద్దు"

బాలాత్రిపురసుందరి ఆగదు. ఆగదని ఆయనకి తెల్సు. అందుకే ఆయన అక్కడనుంచి బైటకి పారిపోతాడు.

"ఈ మేనమామకి అక్కకూతుర్ని చేసుకోవటం అన్న దిక్కుమాలిన ఆచారం తెలుగువాళ్ళకే వచ్చివుండచ్చు. భగవంతుడా...పునర్జన్మ అంటూ ఉంటే నాకు మేనకోడలు అనేదాన్ని వుండనీయకు, వున్నా పెళ్ళాడే అవకాశం రానీయకు మహాప్రభూ!"

మనసులో లక్షలసార్లు దేవుడిని ప్రార్థిస్తుంటాడాయన.

బాలాత్రిపురసుందరి భర్త ఎంతకీ లేవటంలేదని వప్పున దగ్గర కొచ్చి రెండు కాళ్ళూ లాగి చేతులతో కళ్ళకద్దుకుని అంతలోనేఅరిచేసింది.

"పోతారాలేదా! కాఫీచుక్క కోసం నాప్రాణం ఎంత విలవిల్లాడుతూవుందో మీలాంటి మొద్దుముఖానికి ఏంతెలుస్తుంది.. ఎలా తెలుస్తుంది"

సుందరరామయ్య వప్పునలేచి సంచి పుచ్చుకుపోతూ మనసులో అనుకుంటాడు-

'వేదకాలంలోని పతివ్రతామతల్లులారా మీరెంత! మీ పతిభక్తిఎంత! మీ పాతివ్రత్యం ఎంత? రాగల్గిన శక్తే మీకుంటే ఒక్కసారి వచ్చి నా భార్యని చూడండి'

సుందరరామయ్య పాల కవర్లు తీసుకుని వచ్చేసరికి సుందరికి నీరసం వచ్చేసింది. అమరేశ్వరి స్టీలుగ్లాసులో కాఫీతెచ్చి ఇచ్చింది కాబోలు ఆ కాఫీని చప్పరిస్తూ, భర్తని కొరకొరా చూస్తూ-

"మొగుడంటే భీమేశ్వరరావులా వుండాలి. తెల్లవారకుండానే పాలు తెచ్చి కాఫీచేసి అమ్మాయి అమరేశ్వరి లేచేసరికి తయారుగా వుంచుతాడు.

అమరేశ్వరి పూర్వజన్మలో బంగారు పూలతో పూజచేసి వుంటుందికాబోలు అనుకూలుడైన భర్త దొరికాడు. నేనూ చేశానేమో... వుమ్మెత్తపూలతో పూజ. అందుకే దొరికాడు మొద్దుమొఖం, బుద్ధవిగ్రహం. పర్సనాలిటీ మాత్రం వుంది హిందీ సినిమా హీరో సంజీవ్‌కుమార్‌లా"

ఈవిడ అలా అనేసరికి సుందరరామయ్యకే కాదు అమరేశ్వరికీ నవ్వు వచ్చేసింది. ఆ నవ్వు ఆవిడ ఎక్కడ చూసి కోపగించుకుంటుందో అని గ్లాసుకూడా వదిలేసి తన వాటాలోకి పరుగుతీసింది అమరేశ్వరి.

సుందరరామయ్య ముఖం కడుక్కోవటానికి పెరట్లోకి వెళ్ళి పోయాడు.

బాలాత్రిపురసుందరి ఏడుగంటలు దాటిన తర్వాతగానీ కాఫీ ఇవ్వదు భర్తకి. ఆవిడ కావాలని ఎంత ఆలశ్యం చేసినా ఆయన అడగడు. ఆమె తెచ్చి ఇవ్వాల్సిందే. ఇచ్చిన తర్వాత తనలో తను అనుకుంటుంది.

"ఈ మనిషికి ఓ సినిమా పిచ్చిలేదు. సిగరెట్టు పిచ్చిలేదు. పేకాట పిచ్చిలేదు. గుర్రాలపిచ్చిలేదు. ఆఖరుకి కాఫీ పిచ్చికూడా లేదు. ఒట్టి మొద్దుమొఖం"

భార్యముఖంలోని భావాలు చదివేస్తాడు. సుందరరామయ్య ఈ ఆడాళ్ళ మనస్తత్వం ఏమిటో....చస్తే అర్థకాదు. మగాడికి వ్యసనాలుంటే తమ జీవితాలే నాశనం అయినట్లు గోలచేస్తారు. వూరూవాడాఏకంచేస్తారు. అవి లేకుంటే 'మొద్దబ్బాయి' అని తేలికచేస్తారు. ఏంఆడవాళ్ళురా దేవుడా!

ఇలా జరిగిపోతున్నాయి సుందరరామయ్యగారి రోజులు.

## 2

సాయంకాలం ఆరు దాటిన తర్వాత భీమేశ్వరరావు దంపతులు ఇల్లు చేరతారు. భీమేశ్వరరావు వాకిట్లో కూర్చున్న ఇంటావిడని కళ్లతోనే పలకరించినట్టు చిన్నగానవ్వి తన వాటాలోకి వెళ్ళిపోతాడు. అమరేశ్వరిని అలా వెళ్ళనీయదు బాలాత్రిపురసుందరి.

"ఏం కూర చేశావు పొద్దున. ఏం చీరకొన్నవు షాపింగ్ కెళ్ళినప్పుడు" అంటూ గంటసేపు నిలబెట్టేస్తుంది. సుందరరామయ్య ఆఫీసునించివచ్చి ఇది చూస్తాడు.

"ఆపిల్లని లోపలికి వెళ్ళనీయి" అంటేచాలు.

"ఆ అమరేశ్వరితో మాట్లాడితే మీకేంపోయిందీ?" కస్సుమంటుంది బాలాత్రిపుర సుందరి.

"నాకేం పోదుకానీ ఆ అమ్మాయి ఉదయం అనగా ఇల్లు వదిలింది. అవతల అతనువచ్చి లోపలవున్నాడు. ఈమెకోసం ఎదురుచూస్తూంటాడు?

"ఏం కూర్చోడు...ఎంచక్కా కాఫీచేసి రెడీగావుంచుతాడు కదమ్మా అమరేశ్వరీ"

"ఏంకాదు ఈ అమ్మాయే వెళ్ళిచేయాలి"

"కాదు"

"కాదు"

ఈ భార్యాభర్తల వాదనలో అమరేశ్వరి ఔననీ కాదనీ చెప్పకుండా మెల్లిగా జారుకుని బతుకుజీవుడా అనుకుంటుంది.

అంతే! బాలాత్రిపురసుందరికి కోపం వచ్చేస్తుంది.

భర్తతో తగూకిదిగుతుంది. వాదప్రతివాదాలు జరిగిపోతూంటాయి.

ఇక అమరేశ్వరి తమ గదిలోకి వెళ్ళి హాండ్‌బ్యాగ్ టేబులుమీద పడేసి బాత్‌రూంలోకి వెళ్ళి ముఖం కడుక్కువచ్చేసరికి భీమేశ్వరరావు వేడిగా టీచేసి రెండు కప్పుల్లోపోసి రెడీగావుంచి అందిస్తాడు.

ఇద్దరూ కూర్చుని కబుర్లుచెప్పుకుంటూ టీ తాగుతారు, ఆ తర్వాత భీమేశ్వరరావు వారపత్రిక తీసుకుని చదువుకుంటూంటే అమరేశ్వరి వంట చేసి, స్నానంచేసి తెల్లని ఇస్త్రీచీరె కట్టుకుని తను తెచ్చుకున్న పూవులు తలలో తురుముకుని,

"భోజనం చేద్దాం....నిద్దరొస్తోంది" అంది.

"భోజనం చేద్దాంకానీ అప్పుడే నిద్రవస్తేయెలా! పీల్లేదు'' అంటూ కొంటెగా చూశాడు భార్యముఖంలోకి.

"పొండి మీరు మరీనూ" అమరేశ్వరి ఇద్దరికీ వడ్డించింది.

భోజనాలు చేస్తూ కబుర్లలో పడ్డారు.

ఇంటి యజమానుల విషయం కబుర్లలో కదిలింది.

"ఏం దాంపత్యం బాబూ.....పగవాళ్ళకికూడా వద్దు. వాళ్ళకి ఎప్పుడూ తగూనే"

"అలా అనకు"

"ఏం...నేనన్నది తప్పా"

"తప్పన్నర. వాళ్ళు దాదాపు ఇరవై ఏళ్ళుగా కల్సిబతుకుతున్నారు. అంటే ఆమాత్రం మాటామాటా రాదూ! మనలా వాళ్లు కొత్తదంపతులు కారు అన్నది, గుర్తుపుంచుకుంటే నీకలా అన్పించదు"

"కొత్త అయినా పాతైనా అలా ఎవ్వరూ వుండరు. ఛీ ఛీ.....బోర్.

"సరే...ఇప్పుడు వాళ్ళ విషయం ఎందుకు పదిలేద్దాం''

అమరేశ్వరి భర్త ముఖంలోకి చూసి కిలకిలా నవ్వింది.

రేడియోలో హిందీ పాటలు వింటూనే భోజనాలు పూర్తిచేసారు ఇద్దరూ. అమరేశ్వరి వంటగది సర్దేసి, పడక గదిలోకి వచ్చేసింది, తెల్లటి దుప్పటి పరిచిన పక్కమీద భీమేశ్వరరావు కూర్చుని వున్నాడు. అమరేశ్వరి వీధివాకిలి తలుపు మూస్తూ ఇంటివారు ఏంచేస్తున్నారో అని అటు చూసింది.

ఆయన భగవద్గీత చదివి విన్పిస్తూన్నాడు.

ఆమె వింటూ కూర్చుంది ఇది ఆ దంపతులకి అలవాటు.

అమరేశ్వరి నవ్వుకుంటూ తలుపుమూసి వచ్చింది. మంచంమీద వాలిపోయింది.

భీమేశ్వరరావు భార్య దగ్గరగా జరిగాడు. జడలోని పూవులని వాసన చూస్తూ—

"అప్పుడే నిద్రా" అన్నాడు భార్య ముఖంమీద ముఖం పెట్టి.

"నిద్రవొస్తోంది" గోముగా అంది.

"ఓ పావుగంట నిద్రాదేవిగార్ని ఆగమనండి"

అమరేశ్వరి కిలాకిలా నవ్వింది.

కిటికీలోనించి గల్లటి పిల్లతెమ్మెరవచ్చి వారిని స్పర్శించి అలాఅలా వెళ్ళిపోయింది. "ఈ ఇల్లు బాగుంది. ఆ గాలి బాగుంది. ఆ మబ్బులచాటు నుంచి దోబూచులాడే చందమామ మరీ మరీ బాగున్నాడు"

"నీ కవిత్వానికి వేళాపాళాలేదు" భీమేశ్వర్రావు కిటికీ తలుపు టక్కున మూసేశాడు. అంతే!

ఇది యువదంపతుల కథ.

ఇక ఇంటివారి కథ ఏమిటంటే...బాలాత్రిపురసుందరి ఆవ లింతలు ప్రారంభించి-

"నాకు నిద్రవొస్తోంది. ఏవీ ఆ కాళ్ళిలా పారేయండి. నమస్కారం పారేసి నే నిద్దరోతాను. నే ఎప్పుడో భోజనం చేసేశాను. మీరు అన్నం తిని గిన్నెలన్నీ సర్ది తలుపులు సరిగావేసి పడుకోండి. ఏం...అర్థమై చచ్చిందా. రాగిడి మట్టి మెదడు. నా ప్రాణానికి కట్టాడు ఆదేవుడు ఈ మొద్దుమొగుడిని.

అనేసి ఆయన పాదాలకి నమస్కారంచేసి వెళ్ళి మెత్తటి పరుపు మీద పడుకుని దోమతెర చుట్టూ దించుకునే ఓపికలేక రగ్గు ముసుగు పెట్టుకుని-

"ఇదిగో....మిమ్మల్నే ఆ దోమతెర సరిగా సర్ది తగలడండి. మీకిలాంటి సుకారప్పనులు వచ్చి చావవు. నాకు తెల్సు ..కానీ ఏం చేస్తాను. ఈ జన్మకి ఇంతే. మరి తప్పదు ఏడవండి"

అంటూండగానే ఆవిడకి నిద్ర ముంచుకు వచ్చింది. మరో అర గంటకే ఆవిడ రైలు ఇంజన్‌లా శబ్దంచేస్తూ గుర్రు పెట్టటం ప్రారంభించింది. ఆయన లేచి భార్య మంచం చుట్టూ దోమతెర దించి తన మంచం మీదకి వచ్చి ట్రాన్సిస్టర్ ట్యూన్ తగ్గించి పెట్టుకుని పాటలు వింటూ అలా పడుకొన్నాడు.

పాత హిందీసినిమాల్లోని 'రఫీ' పాటలు విన్నిస్తూంటే ఆయన మనసు అలా అలా ఎక్కడికో తేలిపోతూంటుంది, ఆయనకి తెలియకుండానే నిద్రపట్టేస్తుంది. ఎప్పుడో మెలకువ వచ్చినప్పుడు కళ్లు తెరవకుండానే ట్రాన్సిస్టర్‌ని ఆఫ్ చేస్తాడు.

## 3

ఇలా రోజులు గడిచిపోతూన్నాయి. బాలాత్రిపురసుందరి ఏమాట మాట్లాడినా సుందరరామయ్యగారు వేలితో పక్కవాటావైపు చూపిస్తూ-

"ఆ దంపతులనిచూడు...ముచ్చటైనజంట అలావుండాలి. అంతే"

ఆయన మరో మాట మాట్లాడడు. ఈవిషయం బాలాత్రిపుర సుందరికి తెల్సు. కొన్నాళ్ల వుడుక్కుంది. కొన్నాళ్ల వాదానికి దిగింది.

"ఆ అమరేశ్వరి నాలా ఉదయం లేవగానే భర్త పాదాలని కళ్ళకి అద్దుకుంటుందా!"

"భక్తిలేని పూజ పత్రిచేటు"

"ఏమన్నారూ' అరిచింది. నోరు నెప్పిపెట్టేలా తిట్టింది. ఇరుగు పొరుగు అమ్మలక్కలని వారి భర్తలు ఎంత ప్రాణంగా చూసుకుంటారో వర్ణించి వర్ణించి చెప్పింది. భర్తలు వస్తే ఆ భార్యలు కూర్చున్న చోటు నించి లేవనుకూడా లేవరు అంటూ తన మర్యాద గొప్పది అని చెప్పే ప్రయత్నం చేసింది. సుందరరామయ్యగారు వులకలేదు పలకలేదు.

బాలాత్రిపురసుందరి వుడికిపోసాగింది.

ఉదయం. సాయంకాలం భర్త పాదాలకి నమస్కారం చేయని స్త్రీ స్త్రీయేనా! ఈకాలం ఆడపిల్లల మెడలో అసలు మంగళసూత్రాలు వుంటున్నాయా! తన మెడలో నాలుగు కాసుల బంగారంతో చేసిన మంగళ సూత్రాలున్నాయి. వాటిని రోజుకి ఎన్నిసార్లు కళ్ళకద్దుకుంటుంది తను. ఏమిటో తన భర్తకు తన విలువే తెలియదు. ఎంతసేపూ పొరుగింటి పుల్లకూర గురించే కబుర్లు. విసుగ్గా అనుకుని నిట్టూర్చింది బాలాత్రిపుర సుందరి.

ఒకరోజు...

రాత్రి చాలాసేపు నిద్రపట్టక అవస్థపడిన సుందరరామయ్యగారికి తెల్లవారుఝామున నిద్ర పట్టింది. రేడియోలో భక్తిరంజని వినిపిస్తోంటే మెలుకువ వచ్చింది. రగ్గు ముసుగు తీసి గడియారంవైపు చూసి ఆశ్చ ర్యపోతూ-

'సుందరి ఈరోజు సుప్రభాతం పాడలేదు. ఎందుచేతా' అనుకుని భార్యకోసం చూశాడు. ఆవిడ కన్పించలేదు. "సుందరీ" పిలిచాడు. జవాబు రాలేదు. ఇల్లంతా తిరిగి చూశాడు. సుందరి లేదు. ఆయన గుండె దడదడలాడసాగింది.

"సుందరీ...సుందరీ" ఆయనకి తెలియకుండానే ఆపేరు స్మరిస్తున్నాడు.

'ఇంతలో వీధిగేటు తీసిన చప్పుడైంది. చప్పున అటు చూశాడు.

ఆశ్చర్యం! సుందరి పాలకపర్రు పట్టుకుని లోపలికివస్తూ తన చెలికత్తెలకి టాటా చెప్తోంది.

ఇది నిజమా! కలా!? ఆయన ఆలోచనలో పడిపోయాడు..

"గుడ్‌మార్నింగ్ శ్రీవారూ! అప్పుడే లేచారా! అయితే ముఖం కడుక్కోండి. క్షణంలో చిక్కటి కాఫీ ఇస్తాను"

సుందరరామయ్య సుందరిని ఎగాదిగా చూడసాగాడు.

'ఏమిటలా చూస్తున్నారు? నా ముఖాన కోతులు ఆడటంలేదు వెళ్ళండి' అన్న మాటలు భార్య నోటినుంచి వస్తాయని చూశాడు. అవి రాలేదు.

"ఏమిటండీ...ఆ చూపులు. నాకు సిగ్గేస్తోంది బాబూ! వెళ్ళండి. బ్రష్‌మీద పేష్టువేసి వుంచాను"

సుందరి గొంతులోని మృదుత్వం కొత్తగా వింటూంటే ఆయన మనసు గాలిలో అలాఅలా తేలసాగింది. ఆనందంతో గెంతాలనిపిస్తోంది. ఈల వేయాలనీ, పాట పాడాలనీ అన్పిస్తోంది. సుందరిని రెండు చేతుల తోనూ ఎత్తుకుని గిరగిరా తిప్పాలనిపిస్తోంది. ఈ ఆనందాన్ని అణుచుకుని చప్పున ముఖం కడుక్కు వచ్చేసరికి సుందరి చిక్కటి కాఫీ తెచ్చి ఇచ్చింది. అది తాగుతూ అనుకున్నాడు-

'సుందరి రోజూ ఇలా చేస్తే ఎంత బాగుండు!'

"ఏమండీ....మీకు ఏం పోయేకాలం వచ్చింది. ఆరుగంటలైనా నిద్రలేవరు. నాకంటే రాత్రంతా నిద్రలేక తెల్లవారుతుండగా చిన్న కునుకు

పట్టింది. లేవటం ఆలస్యం అయింది. కానీ మీకేం రోగం వచ్చిందనీ తెల్లగా తెల్లారినా లేచిచావరూ."

సుందరరామయ్యగారు స్వప్నలోకంలోనించి దభేలున కిందపడిపో యినట్లుగా మెలుకువ వచ్చింది ఆయనకి. కళ్లు తెరిచారు. ఎదురుగా సుందరి తన ఇష్టాయిష్టాలతో ప్రమేయం లేకుండానే పాదాలని కళ్ళకి అద్దుకుంటూవుంది. ఆయనకి ఒళ్లు మండింది. ఒక్క తన్ను తన్నాలనిపిం చింది. అంతలోనే ఆవేశాన్ని కంట్రోలుచేసుకుని లేచి సంచీ తీసుకుని పాలకవర్లకోసం వెళ్ళిపోయాడు.

పాలుతెచ్చి ముఖం కడుక్కునివచ్చి ముందుగదిలో కూర్చున్నాడు.

ఏడు దాటింది. సుందరి కాఫీఇవ్వలేదు. ఆయన అడగలేదు. తనిలా కూర్చోవటం పక్కనున్న భీమేశ్వరరావు చాలాసార్లు చూశాడు. వాళ్ళు తమని గమనిస్తూన్నారన్న విషయం చాలారోజులవరకూ తెలియలేదు. ఇందువల్ల మరీ మెల్లగా మాట్లాడుతున్నాడు భార్యతో. భార్యకి కోపంవచ్చి గిన్నెలూ, గ్లాసులూ విసురుతూంటే మరీ సహనం వహిస్తున్నాడు. అయినా ఈ వీధిలో వున్న అందరికీ తెలుసు తమ సయోధ్య.

రెండురోజులుగా భీమేశ్వరరావు వాటాలోనించికూడా నవ్వులు విన్పించటంలేదు. కారణం ఏమిటో.

సుందరి కాఫీ తెచ్చి విసురుగా గ్లాసు అందించి "ఆ అమరేశ్వరిని పొగిడేవారుగా...వినండి కాస్త. వాళ్ళ గోల"

"ఏమైంది?"

"ఏమో...నాకేం తెల్సు. కలకల్లాడే ఆ ఇద్దరూ రెండురోజులుగా మౌనవ్రతం పాటించారు. ఆఫీసునుంచి ఎవరికీవారుగా వస్తూన్నారు. ఇవాళ

ఏదో ప్రళయం జరుగుతూవుంది. వినండి....విని బుద్ధి తెచ్చుకోండి. నేనన్నా, నా పాతివ్రత్యం అన్నా మీకు తేలికగా"

సుందరి విసురుగా వెళ్ళిపోయింది.

నిజమే. పక్కవాటాలోంచి భీమేశ్వరరావు అరుపులు విన్పిస్తూ న్నాయి. పరుషమైన మాటలు విసురుతున్నాడు భార్యమీద. అమరేశ్వరి కుళ్ళికుళ్ళి ఏడుస్తోంది.

భీమేశ్వరరావు దబదబా బాదినట్టున్నాడు. అమరేశ్వరి ఏడుపు ఎక్కువైంది.

భీమేశ్వరరావు భార్య జుట్టు పట్టుకుని ఈడ్చుకు వచ్చి గేటు బైటకి తోసేయ బోయాడు.

సుందరరామయ్యగారు చప్పున లేచి వాళ్ళమధ్యకి వెళ్ళారు.

"భీమేశ్వరరావ్...ఏంపనయ్యా ఇదీ. ఛీఛీ...ఆడపిల్లనికొడు తూన్నావా! ఒదులు... ముందు ఆమెని వదులు" భీమేశ్వరరావుని పక్కకి లాగేశాడు

అమరేశ్వరి భోరున ఏడవసాగింది.

"చూడండి బాబాయిగారూ! ఈయన నా జీతం అంతా దీసుకుని వాళ్ళ తల్లి దండ్రులకి పంపేస్తున్నాడు. అలా వద్దన్నానని నన్ను నానా మాటలు అని చివరికి చెయ్యి చేసుకున్నాడు"

"నిజమా భీమేశ్వరరావు...ఇంత చిన్న తప్పుకి ఇంతగా శిక్షి స్తావా! ఏమిటయ్యా ఇదీ! నీకసలు సంస్కారం వుందా"

"బాబాయిగారూ! ఆడది అని గౌరవం ఇస్తే ఇలానెత్తినయెక్కి పిండికొట్టేస్తోంది. నన్ను అష్టకష్టాలూపడి పెంచి పెద్ద చేసిన నాతల్లిదండ్రు లని నేను ఇప్పుడు ఆదుకోవాలా వద్దా? ఈ విషయం పెళ్ళికి ముందే చెప్పి

మరీ చేసుకున్నాను. అప్పుడు సరేనని ఇప్పుడు నాకు అడ్డం వస్తే ఎలా సహించను? ఎలా సహించ మంటారు? చెప్పండి. మీరైతే సహిస్తారా? మీరు సహించగలరేమోకానీ నేను సహించలేను. చేసిన తప్పుకి శిక్ష వేయ కుండా వదలను. పంపేస్తాను. పుట్టింటికి. మీరు కలగజేసుకోకండి దీనికి నోరు ఎక్కువ. పొగరుగా మాట్లాడుతోంది ఈమధ్య. ఎక్కడ నేర్చుకుందో, ఎలా నేర్చుకుందో కానీ దీని ఆటలు సాగనీయను"

భీమేశ్వరరావు అమరేశ్వరి రెక్కపట్టుకుని రోడ్డుమీదకి ఈడ్చు కుపోబోతూంటే లోపలున్న బాలాత్రిపురసుందరి చాలా సేపటినించీ వింటూన్నదల్లా చప్పున వచ్చి అమరేశ్వరిని అమాంతం పొదివి పట్టు కుంది.

"ఏమిటి బాబూ... ఏం పనిదీ? నువ్వు గెంటేస్తే ఆ పిల్ల గతి ఏమిటి అని ఆలోచిస్తూన్నావా? పెళ్ళి అయిందంటే ఆడదానికి భర్తదగ్గరే చోటు. కానీ మరెక్కడాలేదు అన్న విషయం నీకు తెలియదూ" ఆవేశపడసాగింది.

"నిజంగా నిజం చెప్పారు పిన్నిగారూ! ఆ విషయం నాకు బాగా తెల్సు. కానీ తెల్సుకోవల్సింది అది. దానికి గడ్డిపెట్టండి. నాతో సహక రిస్తూ కలిసి బతుకుతానని మాటయిస్తే మీకు మాట ఇస్తూన్నాను. అమరే శ్వరిని గెంటను. భార్యని ఇలా రోడ్డుమీదకి లాగడం ఏమగాడికీ ఇష్టం వుండదు. ఇది గుర్తించమనండి''

భీమేశ్వరరావు విసురుగా తన వాటాలోకి వెళ్ళిపోయాడు. అమరే శ్వరిని బుజ్జగించి సానునయ వాక్యాలు చెప్పి లోపలికి పంపిందేకానీ బాలాత్రిపురసుందరికి భీమేశ్వరరావు అన్న మాటలు శూలాల్లా గుచ్చుకు న్నాయి. అతని మాటలు ఆమె చెవుల్లో ప్రతిధ్వనిస్తూన్నాయి. ఎందుకో

తెలియని బాధగా వుంది. మనసు తీరుబడిగా కూర్చుని ఆ మాటలని మననం చేసుకోసాగింది.

సుందరరామయ్యగారు తీవ్రంగా ఆలోచిస్తూన్నారు.

అమరేశ్వరి చదువుకున్న పిల్ల. సంస్కారంవున్న పిల్ల. భర్త అభిప్రాయాలని అర్థంచేసుకునే పిల్ల. ఇలా ఎందుకు చేస్తుంది! ఎంత ఆలోచించినా అర్థంకావటంలేదు.

రాత్రివరకూ ఆయన అన్యమనస్కంగానే వున్నారు. భార్య నిద్రపోయింది. పక్కవాటాలోంచి నవ్వులూ, కబుర్లూ విన్పిస్తూన్నాయి.

'అద్దం మీద ఆవగింజ' అనుకుని నవ్వుకున్నారు తేలికగా. అంతే! తర్వాత నిద్ర పట్టేసింది.

తెల్లగా తెల్లవారింది.

సుందరరామయ్యగారు వులిక్కిపడి లేచారు. బాలాత్రిపురసుందరి స్నానంచేసి శుభ్రమైన చీరెకట్టుకుని, పేష్ట్‌వేసి బ్రెష్‌తెచ్చి అందించింది.

'సుప్రభాతం శ్రీవారికి. కాఫీ రెడీగా వుంది'

సుందరరామయ్యగారు కాళ్ళ వైపుచూసుకున్నారు. శ్రీమతి తన పాదాలని కళ్ళకి అద్దుకున్నట్టులేదు. ఆమె విసురికి అప్పుడే మెలకువ వచ్చేది అలా రోజూలా చేసివుంటే. విచిత్రం! ఈరోజు ఇలా జరుగుతున్నదేమిటి! కలకాదుకదా! కాదు... నిజమే. మరి ఈ మార్పు ఎలా వచ్చింది? ఎందుకొచ్చింది? కొత్త సూర్యుడు ఉదయించలేదు కదా!